## క్లుప్తంగా

### నేడు చెన్నకేశవస్వామి ఊరేగింపు

బేతంచెర్ల :మండలపరిధిలోని బుగ్గానిపల్లె గ్రామస్తుల ఆరాధ్యదైవం చెన్న కేశవస్వామి ఉత్సవాలు శనివారం ప్రారంభం అయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తిని పురవీధుల గుండా ఊరేగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

### కృష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

కోవెలకుంట్ల: కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కృష్ణానది పరివాహక ప్రాంతంలోనే కేఆర్‌ఎంబీ ఏర్పాటు చేయడం న్యాయబద్ధమన్నారు. అలా కాకుండా అసలు సంబంధంలేని సుదూరంలో ఉన్న విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తామనడం విచారకరమన్నారు. బోర్డు ఏర్పాటు విషయంలో ప్రభుత్వం మరోసారి పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

### క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న నగర పంచాయతీ వైస్ చైర్మన్, కౌన్సిలర్

బేతంచెర్ల: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మధు తెలిపారు. శనివారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో చెన్న కేశవ స్వామి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కబడ్డీ పోటీలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కేశాలు, రఘు, శ్రీనివాసులు, జయరాముడు పాల్గొన్నారు.

### వైఎస్సార్ బీమా సాయం అందజేత



నగదు అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామానికి చెందిన పాండురంగడు గుండె పోటుతో ఇటీవల మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమా పాలసీదారుడు కావడంతో ఆ కుటుంబానికి తక్షణ సాయంగా శనివారం గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సుబహాన్, పంచాయతీ కార్యదర్శి అన్వర్ మృతుని భార్యకు రూ.10 వేలు అందజేశారు. మిగిలిన మొత్తం నామినీ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలమద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరయ్య, వెంకటేశ్వరరెడ్డి, మునిస్వామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కంబగిరిస్వామి పాల్గొన్నారు.

### పశుగ్రాసం దగ్ధం



విద్యుత్ తీగలు తగలడంతో కాలిపోతున్న వరిగడ్డి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తోళ్లమడుగులో శనివారం ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న పసుగ్రాసం విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. ఉమ్మాయిపల్లె తండాకు చెందిన వెంకటేష్ నాయక్ కోర్నపల్లె గడ్డిని కొనుగోలు చేసి తీసుకెళ్తుండగా తోళ్లమడుగులో రోడ్డు క్రాస్ అయిన విద్యుత్ తీగలు తగిలాయి. వరగడ్డితోపాటు ట్రాక్టర్ టైర్లు కాలిపోయాయని రైతు వెంకటేష్ నాయక్ వాపోయాడు. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని గతంలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోక పోవడంతో తనకు నష్టం వాటిల్లిందని బాధితరైతు ఆందోళన వ్యక్తం చేశారు.

### యాగంటిని దర్శించుకున్న నంద్యాల మెజిస్ట్రేట్ సుధాకర్



సుధాకర్‌కు స్వామివారి చిత్ర పటం అందజేస్తున్న ఆలయ చైర్మన్

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమా మహేశ్వరస్వామి ఆలయాన్ని నంద్యాల స్పెషల్ మెజిస్ట్రేట్ సుధాకర్ శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనకు చైర్మన్ తొట బుచ్చిరెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఏకశిలారూపంలో కొలువైన శ్రీ శివ పార్వతులకు మేజిస్టేట్ సుధాకర్ అభిషేకం, అర్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మెజిస్ట్రేట్ సుధాకర్‌ను ఆలయ సంప్రదాయం మేరకు సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని చైర్మన్ అందజేశారు.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న వివిధ గ్రామాల ప్రజలు

బేతంచెర్ల: ప్రజా సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నంటినీ అమలు చేయడంతోపాటు లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలను నేరుగా అందజేస్తున్నారన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఆర్డీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న, విద్యుత్ ఈఈ మధు సూధన్‌రెడ్డి తదితర అధికారులతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై మంత్రి బుగ్గన సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన సర్పంచ్‌లు, నాయకులు, ప్రజలు వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. శ్మశానాలలో మౌలిక వసతులు కల్పించాలని, గ్రామాల్లో డ్రైనేజీ కాల్వలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. వైష్ణవ పుణ్యక్షేత్రమైన పాలుట్ల రంగస్వామికి గూటుపల్లె నుంచి రహదారి ఏర్పాటు చేయాలని సర్పంచ్ శ్రీరాములు, వైస్ ఎంపీపీ నాయిని రంగస్వామి, ఆలయ ఈఓ మద్దిలేటి, మాజీ చైర్మన్ గుండా జగన్ మోహన్‌రావు మంత్రి బుగ్గనకు విన్నవించగా ప్రతి పాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక శేషారెడ్డి సీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెల్లగా సిబ్బంది 24 గంటలు ఉంటారని, సాయంత్రం వరకు డాక్టర్లు అందుబాటులో ఉంటారని, అవసరమనుకుంటే ఫోన్ చేస్తే వస్తారని బుగ్గన చెప్పారు. ప్రమాదకరంగా ఉన్న గోర్లగుట్ట– గోవిందిన్నె సింగిల్ రోడ్డు బ్రిడ్జిని తొలగించి, డబుల్ రోడ్డు బ్రిడ్జి నిర్మించేందుకు రూ. 70 లక్షలు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. బుగ్గానిపల్లెలోని ప్రాచీన నాగలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ. 40 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో రూ. 6 కోట్లతో నిర్మించబోయే ఏపీ టూరిజమ్ గెస్ట్ హౌస్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి స్థల ప్రతిపాదన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను మంత్రి బుగ్గన ఆదేశించారు. కార్యక్రమంలో మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, వైస్ ఎంపీపీ రంగస్వామి, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ రెడ్డి, గుమ్మగాల రాజు, తిమ్మయ్య, ఎంపీటీసీలు మునేశ్వర్‌రెడ్డి, నాగశేషు, రామచంద్రారెడ్డి, నాయకులు బుగ్గన కుమార్ రెడ్డి, గూని నాగరాజు, యాకోబ్, ఎద్దులన్న, రంగస్వామి, మధు, సత్యం, నాగశంకర్, తిరుమలేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

**మండపం భూమి పూజకు మంత్రికి ఆహ్వానం**

పట్టణంలోని చెన్న కేశవ స్వామి ఆలయ ఆవరణంలో రూ.1.50 కోట్లతో నిర్మించే వినాయక, మాధవ స్వామి, వేణుగోపాల స్వామి, ఉత్తర ద్వార దర్శనం ఆర్చీ గేటు, కల్యాణ మండపం ఏర్పాటుకు ఈ నెల 22 చేపట్టనున్న భూమి పూజ కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి బుగ్గనను ఈఓ మద్దిలేటి, మాజీ చైర్మన్ గుండా జగన్, ధర్మకర్త బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి ఆహ్వానించారు. బేతంచెర్ల– డోన్ ఆర్‌అండ్ బీ రోడ్డు ఆర్ బుక్కాపురం గ్రామ రహదారి కిలో మీటర్ మేర గతుకుల మయంగా ఉండటంతో మంత్రి బుగ్గన చొరవతో రూ.42 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు బీటీ రహదారి పూర్తి కావడంతో గ్రామస్తులు బలరాముడు, ముద్దుస్వామి, రమణ, నాగరాజు, శ్రీరాములు, మద్దయ్య మంత్రి బుగ్గనను గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

### హోరాహోరీగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ గురునాథ్

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొత్తకోటలో శనివారం సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ఆరుపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ గురునాథ్ ప్రారంభించగా మొత్తం 18 జతల ఎద్దులు పోటీపడ్డాయి. పాణ్యం మండలం, ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన భీరం సుబ్రహ్మణ్యం వృషభాలు విజేతగా నిలిచి రూ. 35వేలు కైవసం చేసుకున్నాయి. రెండవ, మూడవ స్థానాల్లో ప్యాపిలి మండలానికి చెందిన జోటూరు రామచంద్రారెడ్డి, తిమ్మయ్య వృషభాలు నిలిచి రూ. 25వేలు, రూ.15వేలను సొంతం చేసుకున్నాయి. అదేవిధంగా నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో పెండేకల్‌కు చెందిన బీరం సుబ్రమణ్యేశ్వర రెడ్డి వృషభాలు, దొర్నిపాడుకు చెందిన బత్తుల మనోహర్ వృషభాలు, కలుగొట్ల గ్రామానికి చెందిన గొంది బజారు వృషభాలు నిలిచి వరుసగా రూ. 10 వేలు, రూ. 8 వేలు, రూ. 5 వేలు కైవసం చేసుకున్నాయి.

# వైభవంగా భోగి సంబరాలు



భోగి మంటల సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జయమ్మ, ఓబులరెడ్డి,మేధాశ్రీరెడ్డి

బనగానపల్లె: సంస్కృతి, సంప్రదాయాల సంక్రాంతి పర్వదినం మొదటి రోజ శనివారం భోగి సంబరాలు వైభవంగా జరిగాయి. తెల్లవారు జామునే ఇంట్లోని పాత వస్తువులన్నింటినీ భోగి మంటల్లో వేసి పాత వస్తువులతో పాటు కష్టాలు బూడిదవ్వాలని దుర్గుణాలు సైతం మంటల్లో కలిసి పోయి సద్గుణాలు రావాలని వేడుకుంటూ చిన్న పెద్ద తేడా లేకుండా నృత్యాలు చేశారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు సంబరాల్లో పాల్గొని సతీమణి కాటసాని జయమ్మతో కలిసి కోలాటం ఆడారు. మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

కోవెలకుంట్ల: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ మహిళలు ఇళ్ల ముందు రంగురంగులతో ముగ్గులు, భోగి మంటలతో వేడుకలను జరుపుకున్నారు. సంజామల మండలం పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీవిద్యానికేతన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన రాధికకు మిక్సీ, తర్వాతి రెండు స్థానాల్లో నిలిచిన సునీత, భవితకు రైస్, పప్పుకుక్కర్లను ఎస్ఐ ప్రతాప్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చెన్నమ్మ, గ్రామ పెద్దలు రహంతుల్లా, ఆంజనేయులు, జయరాజు, క్రాంతికుమార్, రమేష్‌గౌడ్, రఫీ, నరసింహమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెలోని అయ్యప్పస్వామి ఆలయంలో భోగి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెయ్యితో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అయ్యప్ప స్వాములు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంపైన జ్యోతి వెలగించి పూజలు చేశారు.

అవుకు: మండల కేంద్రం అవుకుతోపాటు గ్రామాల్లో భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక శ్రీభూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయం బయట భక్తబృందం పెద్ద ఎత్తున భోగి మంటను ఏర్పాటు చేశారు. ప్రతి వీధిలోనూ మహిళలు తమ ఇంటిముందు తెలుగుదనం ఉట్టిపడేలా వివిధ రకాల ఆకృతులతో ముగ్గులను వేసి, వాటిపై గొబ్బెమ్మలతో అలంకరించుకున్నారు. అలాగే పెద్దలు చిన్నారులపై భోగిపండ్లను వేసి ఆశీర్వదించారు.

డోన్: సంక్రాంతి పర్వదిన భోగి సంబరాలు వాడ వాడలా ఘనంగా జరిగాయి. పల్లెల్లో ఎద్దులను అలంకరించి గిరక పందాలు, బండలాగుడు పోటీల్లో నిర్వహించారు. ఇళ్ల ముందు రంగురంగుల రంగవల్లులను వేసి సంబరపడ్డారు. సంప్రదాయం ప్రకారం నువ్వులతో చేసిన సద్దరొట్టె, గుమ్మడికాయ కూరను ఇష్టంగా ఆరగించారు.

డోన్ టౌన్: సంక్రాంతి పర్వదినం భోగిని పురష్కరించుకొని శనివారం ఉడుములపాడు సమీపంలోని దేవాలయం వద్ద చెరువు కట్ట వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన మహిళలకు, యువతులకు సర్పంచ్ ఉప్పరి రాధ సొంత నిధులతో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

డోన్ రూరల్ : స్థానిక నక్కి రామన్న భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా భోగి సంబరాలు ఘనంగా జరిగాయి. మహిళలకు ముగ్గల పోటీలు నిర్వహించిన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు డాక్టర్ యశోద చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కిలెనిన్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్ పి.సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలంలో శనివారం మహిళలు వేకువజామునే ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు వేసి భోగిమంటలను వేసి సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు. గౌరిపేటలోలో వెలసిన చెన్న కేశవ, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులుప్రత్యేక పూజలు చేశారు. సిమెంట్ నగర్ గ్రామంలోని కోదండరామాలయం, గ్రామ దేవత అయిన సుంకులా పరమేశ్వరి దేవి ఆలయాల్లో మహిళలు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి ఇచ్చారు.



కోవెలకుంట్లలో భోగిమంటలు వేస్తున్న దృశ్యం



ముగ్గులు వేస్తున్న దృశ్యం



భోగి మంట కాచుకుంటున్న దృశ్యం





ఆకట్టుకున్న ముగ్గు



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ రాధ

### ప్రతి ఇంటా ఆనందం నింపే పండగ సంక్రాంతి



ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న కాటసాని జయమ్మ

బనగానపల్లె: ప్రతి ఇంటా ఆనందాన్ని నింపే పండగ సంక్రాంతి అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి భోగి సందర్బంగా శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జయమ్మ దంపతులు, తనయుడు కాటసాని ఓబుల రెడ్డి, మేథాశ్రీరెడ్డి దంపతులు ప్రారంభించారు. గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా సంక్రాంతి సెటింగ్స్ ఏర్పాటు చేశారు. భోగి మంటల కార్యక్రమంలో పాల్గొని అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ఈ పండగకు ప్రతి రైతు తాను పండించిన పంటలు తమ ఇళ్లకు చేరడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం దేవుడి దయతో వర్షాలు కురుసి దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయన్నారు. కాటసాని జయమ్మ మాట్లాడుతూ తన కుమారుడు నాగార్జునరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలతో పాటు అధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రూ.కోటితో ఐదు ఎకరములు కొనుగోలు చేయడం జరిగిందని, లలితా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ నిర్మాణ త్వరలో చేపడుతామని పేర్కొన్నారు. కాటసాని ఓబులరెడ్డి, మేథాశ్రీరెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, జేపీసీ కన్వీనర్ డాక్టర్ రవికుమార్, రోటరీ ఐట్రస్ట్ అధ్యక్షులు గాధంశెట్టివేనుగోపాల్, చక్రపాణి, గుండా శ్రీనివాసులు,గుండా రవికుమార్, జక్కానాగరాజు, ఆర్యవైశ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**బహుమతులు అందజేత**

ముగ్గులు వేసేందుకు మొత్తం 150 మంది మహిళలు పోటీపడ్డారు. మొదటి బహుమతిగా సునందకు డబుల్ డోర్ ఫ్రీడ్జి, రెండవ బహుమతి శారదకు సింగిల్ డోర్ ఫ్రీడ్జి, మూడవ బహుమతిగా లక్ష్మీశారదకు ఎల్ఈడీ టీవీ అందజేశారు. నాల్గోవ బహుమతిగా సాయిభావనకు వాసింగ్ మిషన్, ఐదవ బహుమతి హైమవతికి రైస్ కుక్కర్, లక్కిడిప్పు ద్వారా రూ.20వేల విలువ వాటర్ ప్యూరిఫైర్‌తో పాటు పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహ బహుమతులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహిళలు నూకల విశాలక్ష్మీ, నూకలవాసంతి, గుండా సుప్రజా,రూప, బండారు లలితా తదితరులు పాల్గొన్నారు.

### కనుల పండువగా ముగ్గుల పోటీలు



విజేతకు గ్రైండర్‌ను అందిస్తున్న చల్లా శ్రీలక్ష్మీ

అవుకు: మండల కేంద్రం అవుకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం భోగి సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు కనుల పండుగగా జరిగాయి. 38 గ్రూపులు పోటీపడి ముగ్గులు వేయడంతో కార్యాలయ ఆవరణం రంగవల్లులతో నిండిపోయింది. దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి సతీమణి, అవుకు మండల జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, సర్పంచ్ మందా గుర్రమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు చల్లా విక్రాంత్ రెడ్డి తదితర నాయకులు ముగ్గులను తలికించారు. కేటగిరీ ప్రకారం ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా గ్రైండర్లు, మిక్సీలు, స్టవ్‌లతోపాటు మిగిలిన వారందరికీ ప్రోత్సాహకంగా టిఫిన్ బాక్స్‌లను చల్లా శ్రీలక్ష్మి సొంత నిధులు వెచ్చించి కుమారులు చల్లా రాజ్యాభిషేక్ రెడ్డి, జూనియర్ చల్లా రామకృష్ణారెడ్డి చేతులమీదుగా బహుమతుల ప్రధానం చేశారు.

### శ్రీ మద్దిలేటయ్య ఆదాయం రూ.1,86,096

బేతంచెర్ల : మండలపరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివార్లో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామిని శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం , గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ.1,86,096లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతా రామచంద్రుడు తెలిపారు. స్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి నంద్యాల పట్టణానికి చెందిన కృష్ణమూర్తి, రమణమ్మల కుమార్తె శ్వేత రూ. 40 వేలు, హైదరాబాద్, మదీనా గుడకు చెందిన తిరుపతయ్య కుమారుడు రూ.25 వేలు విరాళం అందజేశారు. స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.





### వైభవంగా గోదాకృష్ణుని కల్యాణం

డోన్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం గోదాకృష్ణుని కల్యాణం వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక దేవస్థానం ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, శ్రీనివాసరావు, రజినీ కుమారి, ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాము శర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

### అ'పూర్వ' సమ్మేళనం

కోవెలకుంట్ల: స్థానిక సీవీ రామన్ జూనియర్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. 2003–05 విద్యా సంవత్సరంలో కళాశాలలో ఇంటర్ అభ్యసించి వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒక వేదికపై చేరారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజమోహన్‌రెడ్డి, వికాష్‌బాష, బాబురామయ్య, అమర్నాథరెడ్డి, శ్వేతారెడ్డి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



కల్వటాల వద్ద కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ఏళ్లతరబడి సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం బి.తాడిపత్రి, నాగిశెట్టిపల్లె, బిఉప్పలూరు గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం కింద రూ.కోటితో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల పనులను జెడ్పీ చైర్మన్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు మండలంలో రూ.17 కోట్లతో గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నామన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. గత ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధిని విమర్శించందని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే పల్లెలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. కొలిమిగుండ్ల మండలంలో వేసవి కంటే ముందుగానే చాలా గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి ఎద్దడితో ప్రజలు అల్లాడిపోయేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆపరిస్థితులు లేవన్నారు. జలజీవన్ కింద ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వబోతున్నామని చెప్పారు. బితాడిపత్రి సమీపంలోని చెంచుగూడెంకు ఇప్పటికే విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించామని, త్వరలో రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. నాగిశెట్టిపల్లె ఎస్సీ, ఎస్టీ కాలనీల సమీపంలో వర్షపునీరు, మురుగునీరు వెళ్లేందుకు భారీ కల్వర్టు నిర్మించి ఏళ్లగా నెలకొన్న సమస్యకు పరిష్కారం చూపామన్నారు. కల్వటాల సమీపంలో జగనన్న లేఅవుట్‌తో పాటు పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకునేందుకు ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు పడేవారన్నారు. రూ.25 లక్షలతో ప్రస్తుతం కల్వర్టు నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయకులు కామిని తిమ్మారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వేటకొడవలితో దాడి

ప్యాపిలి: మండల పరిధిలోని గుట్టలపల్లికు చెందిన శ్రీనివాసులుపై అదే గ్రామానికి చెందిన గుర్రాల జయన్న, అతని కుమారుడు రమేశ్ శనివారం వేటకొడవలితో దాడి చేసి గాయపర్చారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీనివాసులు బాబాయి కొండన్నకు గుర్రాల జయన్న మధ్య కొన్నేళ్లుగా రస్తా విషయంలో తగాదా నడుస్తోంది. రెండు నెలల క్రితం గుర్రాల జయన్న, రమేశ్ కలిసి కొండన్న కుమారుడు వేణుగోపాల్‌పై దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో శ్రీనివాసులు అడ్డుపడ్డాడు. దీంతో శ్రీనివాసులుపై కక్ష పెంచుకున్న తండ్రీ కుమారులు శనివారం పొలంలో పని చేసుకుంటున్న శ్రీనివాసులుపై వేటకొడవలితో దాడి చేశారు. దాడిలో శ్రీనివాసులు చేతికి రక్తగాయం కావడంతో అక్కడి నుంచి తప్పించుకుని వచ్చి గట్టిగా కేకలు వేశాడు. స్థానికులు అక్కడకు చేరుకునే సరికి జయన్న, రమేశ్ పారిపోయారు. గాయపడిన శ్రీనివాసులు డోన్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తనను హతమార్చేందుకు జయన్న, రమేశ్ తనపై దాడి చేశారని బాధితుడి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాచర్ల పోలీసులు తెలిపారు.